ఆకులు, అలములను ఆవురావురుమని మేస్తూ.. వడివడిగా నడుస్తున్నయి. కంచెలకు అల్లుకున్న తీగలను రెండుకాళ్లమీద నిలవడి మేస్తున్నయి.

మందలో కొమ్ములు వడితిరిగి, గడ్డం మొలిసిన మేకపోతు.. మరకల ఉచ్చలు వాసన చూస్తూ.. ఎదకొచ్చిన వాటి వీపు మీద రెండు కాళ్లు పెట్టి, సృష్టి కార్యాన్ని నిర్వహిస్తున్నది.

ముసలయ్య.. మేకలను 'దున్నపోతుల వాగు' దాటించి, ఆవలి గట్టున మేపుతున్నడు.

అప్పటివరకూ తెరిపిచ్చిన వాన.. ఒక్కసారిగా కుండపోతలా మారింది. ఈదురుగాలి భయంకరంగా వీచింది. తాటిచెట్లు నేలను తాకుతున్నట్లు వంగి లేస్తున్నయి. పెళుసు కొమ్మలు విరిగి పడుతున్నయి. బలహీనమైన చెట్లు వేళ్లతోసహా పెకిలించుకొని నేల కూలుతున్నయి.




'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో ప్రత్యేక బహుమతి పొందిన కథ.

మేకల మందతో ముసలయ్య ఒక మఱ్ఱిమాను కింద తల దాచుకున్నడు. మేకలన్నీ పడుకొని నెమరు వేస్తున్నయి.

వెంట తెచ్చుకున్న సద్దిమూట విప్పుకొని తిని, ఆకుచుట్ట వెలిగించి ప్రశాంతంగా పొగ తాగుతున్నడు ముసలయ్య. ఇంతలో కడుపుతో ఉన్న మేక.. ఈనడానికి నొప్పులు తీసింది. కుదురుగా పడుకోలేక, నిలబడలేక ఆపసోపాలు పడ్డది. ముసలయ్య ఒడుపుగా మేకకు పురుడు పోసిండు. అమడాల పిల్లలు పుట్టినయి. మాయ పడగానే.. మేక పిల్లలను తల్లిమేక నాకి శుభ్రం చేసింది. మేక పిల్లలను తల్లి మేక పొదుగు దగ్గరపెట్టి, పాలు కుడిపించిండు ముసలయ్య.

మరోదిక్కు చీకటి పడుతున్నది. వాన జోరు మాత్రం ఆగలేదు. మఱ్ఱిమాను మొదలు తప్ప.. నేలంతా వరద కట్టింది. మేకలన్నీ లేసి నిలబడ్డయి. ఉరుములు, మెరుపులతో వాతావరణం భీకరంగా మారింది. ఎక్కడో పిడుగుపడ్డ శబ్దం.. చెవులకు చిల్లులు పడేలా తాకింది.

ముసలయ్య కొప్పెర కప్పుకొని వాగుదాక పోయి చూసిండు. వాగు ఉగ్గరం వచ్చినట్లు పొంగుతున్నది.

ఊళ్లోని ఆలమందలోళ్లు, మేకల మందలోళ్లు సోపతి కూడిన్రు. వాగు దాటనియ్యదని తెలిసి.. ముసలయ్యతో పాటు అంతా ఎనకకు మల్లిన్రు.

అట్లా మొదలైన వాన.. రెండు దినాలైనా తెరిపియ్యలేదు. అందరూ నెగళ్లేసుకొని కూసున్నరు. తడిసిన పుల్లలకు పొగ తప్ప.. మంట రావడంలేదు. అందరూ ఆకలికి, చలికి అలమటిస్తున్నరు. అప్పుడప్పుడూ మేక పాలో, ఆవు పాలో తాగి.. ప్రాణాలు నిలబెట్టుకుంటున్నరు.

ఆకలికి, వాన తడుపు చలికి.. ముసలయ్యకు జ్వరం పట్టింది. దగ్గు ఆగడం లేదు. పెయ్యి కాలిపోతున్నది. ఇంటి మీద పానం గుంజుతాంది. ఈ వానకు ఇల్లెట్లున్నదో!? అవిటి పోరడు, గుడ్డి ముసల్ది.. యాదికచ్చిన్రు. కండ్లపొంట వటవట నీళ్లు గారినై.. ముసలయ్యకు!

''వాన తగ్గినా.. రెండు రోజులైతేగాని వాగు దాటనియ్యది. తెల్లారంగనే డొంక బాటన నడిచి, వాగు పెద్దపాయ దగ్గర దాటి ఊళ్లెకు పోదం!'' అన్నరు సోపతి గాళ్లంతా!.

డొంకదారిన వెళ్లాలంటే పది మైళ్లు నడక.. ముసలయ్యకు పానం మీదికొచ్చినా తప్పింది కాదు. అందరితో పాటు సొలుక్కుంట, సొక్కుకుంట.. మేకపిల్లలను భుజానేసుకొని నడుస్తున్నడు ముసలయ్య. పెయ్యి తిప్పినట్లయి.. కాళ్లు తడవడుతున్నయి. కండ్లు బైర్లు కమ్ముతున్నయి. అయినా.. నమ్మిన ఆసామి కోసం, గుండెల నిండా స్వామిభక్తి నింపుకొని, ఓపికనంతా